ఈనాడు సూర్యాపేట
శుక్రవారం అక్టోబరు 4, 2024 5

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



నేరేడుచర్ల విజయదుర్గ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు అమ్మవారిని బాలత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పూజల అనంతరం రథంపై ఉంచి ప్రధాన కూడలి ప్రాంతం నుంచి భక్తులు తాళ్లతో రథం లాగుతూ ఆలయం వద్దకు తీసుకువచ్చారు. శివాలయంలో ఆలయకమిటీ ఛైర్మన్ రామ కోటేశ్వరరావు, నర్సయ్యగూడెం పురపాలిక వైస్‌ఛైర్‌పర్సన్ సరిత ఉత్సవాలను ప్రారంభించారు. - నేరేడుచర్ల, న్యూస్‌టుడే:

పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు పరిసమాప్తం

మఠంపల్లి, న్యూస్‌టుడే: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుని ఆలయంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తోన్న పవిత్రోత్సవాలు గురువారం జరిగిన పూర్ణాహుతితో పరిసమాప్తమయ్యాయి. ఉదయం ధ్రువ మూర్తికి, ఉభయ దేవేరులతో పాటు క్షేత్రపాలకులు, ఆలయ ప్రాకారాది శిఖరాలకు ధారణ చేసిన పవిత్రాలను సమంత్రకంగా విసర్జన కావించారు. అష్ట కుండలాల్లో పూర్ణాహుతి ఆచరించాక అర్చనాదులతో అభిమర్శించిన సప్తదశ(17) కలశాల నుంచి పుణ్య జలాలు సేకరించి శ్రీస్వామికి, జీవ ధ్వజానికి ప్రోక్షణ చేశారు. సర్వనదీ తీర్థాలతో అభిషేకాది క్రతువులు ముగించి శాంతి కల్యాణం జరిపించారు. నిత్య కైంకర్యాలు, మహా ర్నివేదనల తదుపరి భక్త జనులకు శేష పవిత్రాలను వితరణ చేశారు. తీర్థ, ప్రసాద వినియోగాలు పూర్తయ్యాక ఆచార్య సన్మానం జరిగింది. ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, అర్చకులు పాల్గొన్నారు.



మట్టపల్లి: పూర్ణాహుతికి ముందు అగ్నిని ఆరాధిస్తున్న యాజ్ఞికులు

తుది ఓటరు జాబితా విడుదల

★ జిల్లాలో 6,82,882 మంది ఓటర్లు

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఓటరు తుది జాబితాను శనివారం విడుదల చేశారు. జిల్లాలో 23 మండలాల్లో 486 గ్రామ పంచాయతీలున్నాయి. అందులో 4388 వార్డులుగా విభజించారు. కాగా గత నెల ముసాయిదా జాబితా విడుదల చేసి అందులో అభ్యంతరాలపై 6 నుంచి 14 వరకు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అదే నెలలో జిల్లా, మండల స్థాయిలో ఎంపీడీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్డీవోలు, కలెక్టర్ ఆధ్వర్యంలో రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం సెప్టెంబరు 28న విడుదల చేసిన తుది జాబితాలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,82,882 మంది ఓటర్ల జాబితాను ప్రచురించారు. అందులో 3,35,542 మంది పురుషులు, 3,47,320 మంది మహిళా ఓటర్లున్నారు. 20 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా జిల్లా వ్యాప్తంగా తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల్లో మినహా మిగతా 21 మండలాల్లో మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. పంచాయతీ ఎన్నికల ప్రకటన జారీ అయ్యే వరకు జాబితాలో మార్పులు, చేర్పులకు అభ్యంతరాలను స్వీకరించి పొందుపర్చడం జరుగుతుందని పంచాయతీ అధికారులు వివరించారు. ఎక్కువగా వార్డు మార్పులపై దరఖాస్తులు అందాయని వెల్లడించారు.

సూర్యాపేట నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆత్మకూర్(ఎస్)	21,315	21,599	0	42,914
చివ్వెంల	14,007	14,468	0	28,475
పెన్‌పహాడ్	16,302	17,018	0	33,320
సూర్యాపేట	15,383	15,619	1	31,003
కోదాడ నియోజకవర్గం				
కోదాడ	15,239	16,139	0	31,378
అనంతగిరి	12,396	13,1369	1	25,536
చిలుకూరు	15,682	16,668	0	32,350
మోతె	18,521	18,890	4	37,415
మునగాల	17,772	18,634	0	36,406
నడిగూడెం	11,971	12,283	1	24,255
హుజూర్‌నగర్ నియోజకవర్గం				
హుజూర్‌నగర్	10,099	10,511	0	20610
చింతలపాలెం	12,966	13,514	0	26,480
గరిడేపలి	22,247	23,693	7	45,947
మఠంపల్లి	18,159	19,091	1	37,251
మేళ్లచెరువు	16,494	17,269	1	33,764
నేరేడుచర్ల	10,584	11,213	0	21,797
పాలకవీడు	10,149	10,873	0	21,022
తుంగతుర్తి నియోజకవర్గం				
తుంగతుర్తి	16,957	16,868	0	33,825
తిరుమలగిరి	8,812	8,763	0	17,575
మద్దిరాల	12,428	12,565	1	24,994
నూతనకల్	14,216	14,223	0	28,439
నాగారం	11,943	12,162	3	24,108
జాజిరెడ్డిగూడెం	11,900	12,118	0	24,018

ఆశలు ఆవిరై.. కన్నీళ్లు ఏరులై..!

బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు తుంగతుర్తి, తిరుమలగిరి, మద్దిరాల మండలాల్లో వరి పొలాలు పెద్ద ఎత్తున నేలవాలగా.. పత్తి చేలల్లో పగిలిన కాయల్లోకి నీరు చేరి పత్తి మొత్తం తడిసి ముద్దయ్యింది. రూ.లక్షల పెట్టుబడి పెట్టి పండించిన పంట చేతికందే సమయంలో తీరని నష్టాన్ని కలిగించిదని రైతన్న గోడుమంటున్నాడు.

★ తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన నెమరుగొమ్ముల లక్ష్మణ్‌రావు ఏడెకరాల భూమిలో వరి డ్రమ్‌సీడ్ పద్ధతిలో సాగు చేశారు. పది రోజుల్లో కోత కోసే దశలో ఉండగా వర్షం, ఈదురు గాలులకు మొత్తం అడ్డం పడిపోవటంతో ధాన్యం చేతికందే పరిస్థితి లేక తీవ్ర వేదనకు గురయ్యారు. తుంగతుర్తి, అన్నారం, సంగెం, కొత్తగూడెంతోపాటు అన్ని గ్రామాల్లో వందల ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. కంకుల్లోకి, పత్తి చేలల్లో పగిలిన కాయల్లోకి నీరు చేరి పత్తి పూర్తిగా తడిసి పోయింది. పత్తి కాయలు రాలిపోవటంతో ఆశలు ఆవిరయ్యాయని ఆందోళన చెందుతున్నారు.

★ మద్దిరాల మండలంలో నెలకొరిగిన వరిపైరును మండల వ్యవసాయాధికారి మల్లారెడ్డి గురువారం పరిశీలించి సుమారు 80 ఎకరాల్లో దెబ్బతిందని 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

★ ఆత్మకూరు(ఎస్) మండలంలోని కోటినాయక్‌తండా, దుబ్బతండా, శంకన్నగూడెం, పాత సూర్యాపేట, నెమ్మికల్ గ్రామాల పరిధిలో కోత, పొట్టదశకు వచ్చిన వరి నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా శంకన్నగూడెంలోని గూడూరు వెంకటరెడ్డి, కుంట్ల రవీందర్‌రెడ్డి, జాటోత్ రాజు, సామ మోహన్‌రెడ్డి, సామ వెంకటరెడ్డికి చెందిన వరి పొలాలు పూర్తిగా వాలిపోయాయి.

– న్యూస్‌టుడే, తుంగతుర్తి, తిరుమలగిరి, మద్దిరాల, ఆత్మకూరు(ఎస్)



తుంగతుర్తి: కొత్తగూడెంలో నేలవాలిన వరి



తిరుమలగిరి: గుండెపురిలో పడిపోయిన వరి పైరును చూపిస్తున్న రైతు

ఇదే ఆఖరి గడువు



రాజపేట, ఆలేరు, న్యూస్‌టుడే:

ప్రభుత్వం ఎంత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినా పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతూనే ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా నిత్యం ఎక్కడో ఒక చోట క్వింటాళ్ల కొద్దీ పీడీఎస్ బియ్యం పోలీసులకు పట్టుబడుతోంది. ఈ అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు, అర్హులకే బియ్యం అందేలా చూసేందుకు ప్రభుత్వం రేషన్ కార్డులకు 'ఈ కేవైసీ' (ఎలక్ట్రానిక్- నో యువర్ కస్టమర్)ని తప్పనిసరి చేసింది. ఈ ప్రక్రియ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకే రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకుంటోంది. ఏదైనా కుటుంబంలో ఒక లబ్ధిదారు ఈ కేవైసీ చేయించుకోకుంటే వారి పేర్లను కార్డుల్లోనుండి తొలగించనున్నారు. ఇందుకోసం పలు దఫాలుగా పొడిగించిన గడువును ప్రభుత్వం తాజాగా మళ్లీ పొడిగించింది. నెలాఖరుతో ముగియనున్న తేదీని డిసెంబరు 31 వరకు పెంచింది. మరోసారి ఈ అవకాశం ఉండబోదని, నిర్లక్ష్యం చేసిన లబ్ధిదారులు ఆ తర్వాత రేషన్ పొందలేరని ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

80శాతం కూడా దాటని ప్రక్రియ..

ఈ కేవైసీ నమోదు ప్రక్రియ కార్యక్రమం గత భారాస ప్రభుత్వ హయాంలో మొదలైంది. నల్గొండ జిల్లాలో 3,68,041 మంది, సూర్యాపేట జిల్లాలో 2,50,916 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,78,926 మంది ఇంకా ఈ కేవైసీకి నోచుకోలేదు. ఏ ఒక్క జిల్లాలోనూ ఈ కేవైసీ 80 శాతం పూర్తి కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంకా 7,97,883 మంది లబ్ధిదారులు ఈ కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. లబ్ధిదారులు ఈ సారి నిర్లక్ష్యం చేస్తే ప్రయోజనం కోల్పోయే అవకాశం ఉంది. తస్మాత్ జాగ్రత్త..

ఉమ్మడి జిల్లా వివరాలు..

జిల్లా	రేషన్‌కార్డులు	లబ్ధిదారుల సంఖ్య	ఈ కేవైసీ చేసుకున్నవారు	శాతం
నల్గొండ	4,66,181	13,94,172	10,26,131	73
సూర్యాపేట	3,24,222	9,32,444	6,81,528	73
యాదాద్రి	2,16,848	6,60,259	4,81,333	79

జాప్యానికి పలు కారణాలు..

- ఎక్కువ మందికి ఆధార్ నవీకరణ, బయోమెట్రిక్ వంటి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి.
- గత పదేళ్లలో చాలా మంది చనిపోయారు. వారి వివరాలు అప్‌డేట్ చేయకపోవడం.
- యువతులు, వివాహాలు చేసుకుని అత్తవారిళ్లకు వెళ్లిపోయారు. కొత్త కాపురాలు పెట్టిన వారికి నూతన కార్డులు మంజూరు కాలేదు.
- లబ్ధిదారుల పేరుతో కొందరు డీలర్లు రేషన్ నిల్వలు పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలున్నాయి.
- క్షేత్రస్థాయిలో పలు సమస్యలున్నప్పటికీ కొత్తకార్డులు లేకున్నా రేషన్ బియ్యం పంపిణీ ఆహారభద్రత కార్డుల ఆధారంగా యథావిధిగా కొనసాగుతుంది.



నేడు 'ప్రపంచ చిరునవ్వు దినోత్సవం'

కాస్త నవ్వండి.. బాస్..!

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

నవ్వు నాలుగు విధాలా చేటు.. అనేది పాత సామెత.. నవ్వు నలభై విధాల మేటి అనేది నేటి సామెత. నవ్వడం ఒక భోగం.. నవ్వించడం ఒక యోగం.. నవ్వకపోవడం ఒక రోగం..అన్నాడో సినీ కవి. ఎలాంటి సమస్యనైనా చిన్న చిరునవ్వుతో దూరం చేయొచ్చంటున్నారు నిపుణులు. ఇలాంటి నవ్వు పట్ల నేటి తరానికి అవగాహన లేకపోవడంతో నిరంతరం ఘర్షణలు, తగాదాలతో కాలం గడుపుతున్నారు. మరో వైపు సమాజంలో భావి భారత పౌరులను తీర్చి దిద్దే ఉపాధ్యాయులు, శాంతి భద్రతలను పరిరక్షించే పోలీసులు నవ్వుతో తమ సేవలు అందించడం వల్ల మెరుగైన ఫలితాలు పొందొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. నవ్వు గొప్పతనాన్ని వివరించేందుకు ఏటా అక్టోబరు మొదటి శుక్రవారం 'ప్రపంచ చిరునవ్వు దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

చిరునవ్వు వల్ల కలిగే ప్రయోజనాలు ఇవీ..

- గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- రక్తపోటు తగ్గుతుంది.
- సహజ నొప్పి నివారిణిగా ఉపకరిస్తుంది.
- ఎక్కువ కాలం జీవించేందుకు దోహదపడుతుంది
- స్నేహబంధం బలపడుతుంది.
- ఒత్తిడిని తగ్గిస్తుంది.
- మానసిక స్థితిని మెరుగు పరుస్తుంది.
- యవ్వనంగా, ఆకర్షణీయంగా కనిపించేందుకు తోడ్పడుతుంది.
- ఇతరులలో నమ్మకాన్ని కలిగిస్తుంది.


చిన్న చిరునవ్వుతో అనేక సమస్యలు దూరం..

ఏదైనా సమస్యతో వచ్చిన వారిని చిన్న చిరునవ్వుతో పలకరిస్తే కొండంత అండ దొరికినట్లు భావిస్తారు.


ఉమ్మడి జిల్లాలో 3,209 పాఠశాలలు ఉండగా..

వీటిలో 2,11,009 మంది విద్యార్థులు ఉన్నారు.

వీరిలో అనేక మంది విద్యార్థులు ఒకటి, రెండు సబ్జెక్టుల్లో వెనుకబడి ఉంటున్నారు. మరి కొంత మంది నలుగురిలో కలిసేందుకు ఇబ్బంది పడుతుంటారు.అయితే ఆయా తరగతుల ఉపాధ్యాయులు చిరునవ్వుతో విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలిగితే వారి సమస్యలు దూరం చేయొచ్చంటున్నారు నిపుణులు. కోపంతో కాకుండా చిరునవ్వుతో విద్యార్థులకు పాఠాలు బోధించడం వల్ల అవి త్వరగా వారి మెదడులో నిక్షిప్తం అవుతాయని నిపుణులు చెబుతున్నారు.



పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో ఉన్న ఉమ్మడి జిల్లా యువత..



శాంతి చిరునవ్వుతోనే ప్రారంభమవుతుంది: మదర్ థెరిసా




ఉపయోగాలు ఇలా..

డాక్టర్ భవాని, మానసిక వైద్య నిపుణురాలు, మిర్యాలగూడ



అనుక్షణం నవ్వుతూ ఉండటం వల్ల ఎండార్ఫిన్ అనే హార్మోన్ విడుదలై సంతోషాన్ని అందించడంతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. నవ్వుతూ ఉండే వారికే ఎక్కువ మంది స్నేహితులు ఉంటారు. తరచూ చిరునవ్వుతో ఉండటం వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు గుండె జబ్బులు నియంత్రణలో ఉండటం, రోగ నిరోధక శక్తి వృద్ధి చెందడం వంటి ప్రయోజనాలు కలుగుతాయి.

కాఠిన్యాన్ని దూరం చేయాలి..



పోలీసులంటే సాధారణ పౌరులకు సైతం ఒక రకమైన భయం కలుగుతుంది. దీనిని నివారించేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ అమలులో మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. దీంతో పోలీసులతో తమ సమస్యను మనస్ఫూర్తిగా చెప్పే అవకాశం ప్రజలకు దక్కడం లేదు. దీన్ని నివారించేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో పోలీసులు చిరునవ్వుతో పలకరిస్తే వారి సమస్యలు వివరంగా చెప్పగలిగే వాతావరణం ఏర్పడుతుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం అనేక మంది ఉమ్మడి జిల్లా యువత పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో ఉద్యోగాలు సాధించారు. వీరంతా తమ విధులను చిరునవ్వుతో నిర్వర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు.

హుజూర్‌నగర్‌కు పారిశ్రామిక శిక్షణ సంస్థ మంజూరు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్‌కు పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) మంజూరు చేయించినట్లు నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను విలేకరులకు విడుదల చేశారు. ఈ ఐటీఐ భవన నిర్మాణానికి రూ. 14.35 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతనంగా మంజూరైన ఐటీఐ శిక్షణ సంస్థలో ఐదు కోర్సులు ఏర్పాటు చేస్తారు. మొత్తం 216 మందికి శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఈ సంస్థకు ప్రిన్సిపల్ పోస్టుతో సహా మొత్తం 17 పోస్టులు మంజూరు చేసింది. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్, డీజిల్ మెకానిక్, వెల్డర్ కోర్సులలో శిక్షణ ఇస్తారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అత్యధికంగా సిమెంటు పరిశ్రమలు, రైస్ మిల్లు పరిశ్రమలు ఉండటం వల్ల ఐటీఐ శిక్షణ పొందిన వారికి మంచి అవకాశాలు ఉంటాయి. వాటిని అందిపుచ్చుకునేందుకు అవకాశం లభిస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ పరిస్థితులను వివరించి ఒప్పించి ఐటీఐని మంజూరు చేయించినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

డీజేల వినియోగంపై నిషేధం: ఎస్పీ

సూర్యాపేట నేరవిభాగం: కలెక్టర్ ఉత్తర్వుల మేరకు సూర్యాపేట జిల్లా పరిధిలో ఈ నెల14 వరకు డీజేలు నిషేధిస్తున్నట్లు నల్గొండ ఎస్పీ, సూర్యాపేట జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో డీజేల నుంచి ఉత్పన్నమయ్యే అధిక శబ్దాల కారణంగా మానసిక ఆరోగ్యంపై ప్రభావాలు చూపుతున్న కారణంగా నిషేధం విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా వినియోగిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

బహుళ ప్రయోజనాలతో 'డిజిటల్ కార్డులు'



మద్దిరాల: రామచంద్రాపురంలో సర్వేలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఒకే రాష్ట్రం ఒకే కార్డు'.. కుటుంబ గుర్తింపు- కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్, ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రత్యేకాధికారిణి అనితా రామచంద్రన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పైలెట్ గ్రామం రామచంద్రపురాన్ని గురువారం వేర్వేరుగా సందర్శించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. డిజిటల్ కార్డుల కోసం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్త సభ్యుల పేర్లు జత చేయడం, నూతన కుటుంబ కార్డులు నమోదు ప్రక్రియ, పేరులో సవరణలు వంటివి డిజిటల్ కార్డు సర్వేలో చేస్తున్నట్లు వివరించారు. జడ్పీ సీఈవో అప్పారావు, తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పుష్ప, మహేష్, ఉమ, రాజు, గ్రామస్థులు రఘుపతి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పరిశీలన వేగవంతం చేయండి

సూర్యాపేట కలెక్టరేట్: డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఈనెల 5 వరకు మాత్రమే ఉందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. డీఈవో కార్యాలయంలో జరుగుతున్న ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 386 మంది ఎంపికయ్యారన్నారు. ప్రభుత్వం సూచించిన నిష్పత్తిలో పత్రాల విచారణ జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 206 మంది అభ్యర్థులు మాత్రమే పరిశీలన జరిగిందన్నారు. రెండు రోజులు మాత్రమే అవకాశం ఉన్నందున, ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. డీఈవో అశోక్, ఎం. ప్రకాశ్, వెంకటేశ్వర్లు, ఉషారాణి, వెంకటయ్య, మల్లారెడ్డి, వెంకట రమణ, ఉపేందర్, శ్రీహరి, శేఖర్, జి. శ్రీనివాస్, శ్రవణ్ కుమార్, దీపాదేవి, నాగేశ్వర్‌రెడ్డి, మురళికృష్ణ, ఎం. ప్రకాశ్ పాల్గొన్నారు.

వంటకు తప్పిన తంట

◆ మధ్యాహ్నభోజన నిర్వాహకులకు బకాయి సొమ్ము విడుదల



బొందుగుల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న మహిళలకు ప్రభుత్వ పరంగా ఊరట లభించింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసింది. జూన్ నుంచి ఆగస్టు వరకు ఉమ్మడి నల్గొండ జిల్లాకు రావాల్సిన మొత్తం రూ.4.84 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు భోజనం బిల్లులో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్న విషయం తెలిసిందే. కోడిగుడ్ల బిల్లులను రాష్ట్రమే చెల్లిస్తుంది. మధ్యాహ్నభోజనం నిర్వహించే మహిళలకు చెల్లించే గౌరవ వేతనం రూ.3 వేల గౌరవ భృతిలో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.600, మిగతా రూ.2,400 రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్న విషయం తెలిసిందే.

నేరుగా ఖాతాల్లోనే జమ..

ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మొత్తం 3,210 మధ్యాహ్న భోజన ఏజెన్సీలున్నాయి. వీరు పాఠశాలల్లో ప్రతిరోజూ నియమిత మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వంట చేసే మహిళలకు ఈ ఏడాది జూన్ నుంచి బిల్లులు రావాల్సి ఉంది. ప్రతి నెలా బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వాహక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డ విషయం తెలిసిందే. ముఖ్యంగా పెరుగుతున్న కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలతో గిట్టుబాటు కావడం లేదని, బిల్లులు సకాలంలో రాని కారణంగా వారు అప్పులు తెచ్చి వంట చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారి పరిస్థితి తెలుసుకున్న ప్రభుత్వం నిర్వాహకులకు రావాల్సిన వంట ఖర్చులతో పాటు గౌరవ వేతనం కూడా విడుదల చేసింది. మూడు నెలలకు సంబంధించి మొత్తం సొమ్మును నేరుగా సదరు మహిళల ఖాతాల్లో జమ చేసినట్లుగా విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

ఉమ్మడి నల్గొండ జిల్లా బిల్లుల వివరాలు..	
మొత్తం పాఠశాలలు : 3,210	విద్యార్థుల సంఖ్య 2,11,009
భోజనం బిల్లు :	రూ.3,40,47,153
కోడిగుడ్ల బిల్లు :	రూ. 1,43,64,900
మూడు నెలల మొత్తం బిల్లు :	రూ.4,84,12,053

కోడిగుడ్లకు మొత్తం చెల్లింపు..

ప్రభుత్వ ఆదేశం ప్రకారం మధ్యాహ్న భోజనంలో భాగంగా విద్యార్థులకు వారానికి మూడు సార్లు కోడిగుడ్లు అందిస్తున్నారు. వీటి బిల్లులు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో నిర్వాహకులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు. బహిరంగ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.6 ఉండగా.. ప్రభుత్వం వంట చేసే మహిళలకు రూ.5 చొప్పున మాత్రమే చెల్లిస్తుండటం గమనార్హం. అది కూడా నెలనెలా చెల్లించడం లేదు. ఏజెన్సీలు పెట్టుబడులకు బయట అప్పులు చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్లకు సంబంధించిన బిల్లులు కూడా వచ్చాయని పాఠశాల వర్గాలు అంటున్నాయి. జూన్ నుంచి గత ఆగస్టు నెల వరకు రావాల్సిన సొమ్మును ఎస్టీవో ద్వారా మహిళల ఖాతాల్లో జమ చేశారు. గత విద్యా సంవత్సరం బకాయిలు ఈ ఏడాది జూన్‌లో విడుదలైన విషయం తెలిసిందే. తాజాగా ఆగస్టు వరకు బిల్లులు చెల్లించడంతో మధ్యాహ్న వంట నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఊరంతా లారీలే..

వంద మందికి పైగా డ్రైవర్లే..!



సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: ఆ ఊళ్లో ఎవరినైనా కదిలిస్తే.. మా నాన్న డ్రైవరు, మాకు లారీలు ఉన్నాయి.. మా అన్న డ్రైవర్.. మా తమ్ముడు డ్రైవర్, వాళ్లకు లారీలు ఉన్నాయని చెబుతుంటారు. ఎందుకంటే ఆ గ్రామంలో వందకుపైగా లారీ పరిశ్రమనే నమ్ముకొని జీవిస్తున్నారు. సంస్థాన్ నారాయణపురం మండలం అల్లందేవిచెర్వు గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంది. 130 కుటుంబాలు ఉన్న ఈ ఊరిలో ప్రతి ఇంటిలో వ్యక్తి లారీ పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఇలా గ్రామంలో లారీ ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లుగా పనిచేస్తున్నారు. ఊర్లో సుమారు 150కు పైగా లారీలు ఉండేవి. 45 ఏళ్లుగా ఈ వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ కొన్ని కుటుంబాల్లో ఒక్కొక్కరికి నాలుగు వరకు లారీలు ఉండటం విశేషం.

మొదట క్లీనర్‌గా పనిచేసిన వారు డ్రైవర్లుగా మారారు. తర్వాత లారీ ఓనర్ కమ్ డ్రైవర్‌గా.. రాను రాను లారీలకు యజమానులుగా మారి ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగు లారీలతో వ్యాపారం కొనసాగిస్తున్నారు. కొంత మంది డ్రైవింగ్ వీల్డ్ సంబంధం లేకున్నా లారీ యజమానులుగా మారి డ్రైవర్లతో లారీ పరిశ్రమను నమ్ముకొని ఉపాధి పొందుతున్నారు. ఇక్కడి ప్రస్తుతమున్న యువత చాలా వరకు లారీ డ్రైవర్లుగానే ఉపాధి పొందుతున్నారు. కరోనా విపత్తు తర్వాత డ్రైవర్ వృత్తి ఇబ్బందికరంగా మారడంతో పాటు వ్యాపారం అంత లాభసాటిగా లేకపోవడంతో గ్రామంలో లారీ వృత్తి మసకబారుతోంది. నాలుగు లారీలు ఉన్నవారు ఒకటి రెండుకు వచ్చారు. ఒక్క లారీ ఉన్న వారు డ్రైవర్లుగా మారారు. ప్రస్తుతం ఇప్పుడు సుమారు వంద లారీల వరకు ఉన్నాయి.

మొదట ఆ ఇద్దరే..

మొదట ఈ గ్రామంలో అంతటి భిక్షపతి, యాదయ్యలు 1980లో డ్రైవర్లుగా ఉన్నారు. వీరి వద్ద క్లీనర్‌గా వెళ్లి డ్రైవర్లుగా మారుతూ.. ఒకరి నుంచి ఒకరు అంతగా లారీ డ్రైవర్లు, ఓనర్లుగా మారారు. మొదట గ్రామంలో లారీ యజమానిగా మారింది కూడా అంతటి భిక్షపతే. ఐతే ఈ ఊర్లో డ్రైవర్లుగా పని చేసి వయసు మీద పడిన వారు ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్నారు. ఆ ఇంట్లో లారీ పరిశ్రమను మాత్రం వదలలేదు. దసరా పండుగ రోజు ఈ లారీలన్నీ స్వగ్రామం చేరుకుంటాయి. లారీల రాకతో ఈ గ్రామం సందడిగా మారుతుంది. తెలంగాణ రాష్ట్ర ఇసుక లారీల యాజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సుర్వి యాదయ్య, ఆటో నగర్ ఇసుక లారీల యజమానుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న సుర్వి రాజుగౌడ్ అల్లందేవి చెర్వు గ్రామస్థులే కావడం విశేషం.



నలభై ఏళ్ల క్రితం మొదటిసారి అంతటి భిక్షపతి కొనుగోలు చేసిన లారీ (దాచిన చిత్రం)

సిమెంట్స్ కర్మాగారంపై పీసీబీ చర్యలు?

దామరచర్ల, న్యూస్‌టుడే: కాలుష్య నియంత్రణలో విఫలమైన ఓ సిమెంట్ కర్మాగారంపై పీసీబీ (కాలుష్య నియంత్రణ మండలి) అధికారులు చర్యలు చేపట్టినట్లు సమాచారం. నల్గొండ జిల్లా దామరచర్ల మండలంలోని సిమెంట్ పరిశ్రమను గురువారం తనిఖీ చేసిన పీసీబీ అధికారులు.. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ప్లాంట్‌ను రన్ చేయవద్దని లిఖిత పూర్వకంగా యాజమాన్యానికి సూచించినట్లు సమాచారం. నెల రోజులుగా పరిశ్రమ నుంచి విపరీతంగా దుమ్ము, పొగ విడుదల కావడంతో పరిసర గ్రామాల ప్రజలు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పీసీబీ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరుపగా ప్లాంటులో డస్ట్ క్లీనర్లు అమర్చకపోవడంతో అధిక మోతాదులో పొగ గొట్టాల ద్వారా దుమ్ము వెలువడుతున్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ విషయమై పీసీబీ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు. తహసీల్దార్ జవహర్‌లాల్‌ను అడుగగా తమకు సమాచారం లేదన్నారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలు సెమీస్‌కు చేరాయి. గురువారం కోమటిపల్లి మైదానంలో నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లా జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఒక్క వికెట్ తేడాతో ఖమ్మం విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. విక్రాంత్‌రెడ్డి 137 పరుగులతో రాణించాడు. ఛేదనలో ఖమ్మం జట్టు నిర్ణీత 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి.. సెమీస్‌లోకి దూసుకెళ్లింది. దివిన్ 75, రత్న ఆర్యన్ 45 పరుగులతో విజయంలో కీలకప్రాత పోషించారు.

నాన్నే స్ఫూర్తి..!

మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మక ఐఐటీ కాన్పూర్‌లో ఇంజినీరింగ్ పట్టా పొందినప్పటికీ.. సివిల్ సర్వీసెస్‌లో ఐఆర్ఎస్ సాధించిన నాన్న స్ఫూర్తితో కష్టపడి చదివి తొలి ప్రయత్నంలోనే 70వ ర్యాంకుతో ఐఏఎస్ సాధించానంటున్నారు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి. 2022 బ్యాచ్‌కు చెందిన ఆయన వికారాబాద్‌లో అదనపు కలెక్టర్‌గా శిక్షణ పొంది.. ఇటీవలే మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన 'న్యూస్‌టుడే'తో పలు విషయాలు పంచుకున్నారు.

పలు రాష్ట్రాల్లో చదువు..

నాన్న జగదీశ్‌బాబు ఆదాయ పన్నుశాఖలో ఐఆర్ఎస్ హోదాలో అధికారిగా పని చేస్తున్నారు. అమ్మ సుధారాణి గృహిణి. నాన్న ఉద్యోగ రీత్యా నా చదువు ఆరో తరగతి వరకు ముంబయిలో, ఏడు, ఎనిమిది తరగతులు దిల్లీలో, తొమ్మిది నుంచి 12వ తరగతి వరకు హైదరాబాద్‌లో సాగింది. అనంతరం ఐఐటీ కాన్పూర్‌లో కెమికల్ ఇంజినీరింగ్‌లో 2020లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. నాన్న స్ఫూర్తితో సివిల్స్‌కు సన్నద్ధమై 2022లో తొలి ప్రయత్నంలోనే 70వ ర్యాంకుతో ఐఏఎస్‌కు ఎంపికయ్యాను. తెలంగాణ క్యాడర్‌కు కేటాయించటంతో.. రెండేళ్ల పాటు వికారాబాద్‌లో అదనపు కలెక్టర్‌గా ప్రస్తుత జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి వద్ద శిక్షణ పొందాను. శిక్షణ అనంతరం తొలిసారి మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాను.

అదే నా వ్యాపకం..

ఖాళీ సమయాల్లో క్రికెట్ ఆడడం, ఓటీటీలో సినిమాలు చూడడం నా అలవాటు. ప్రస్తుతం పెద్ద డివిజన్‌కు బాధ్యతలు చేపట్టడంతో క్రికెట్ ఆడే సమయం ఉండడం లేదు. వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించి.. వారి సంక్షేమానికి తక్షణమే చర్యలు చేపడుతున్నాం. ప్రజలు ఎటువంటి సమస్యలు ఉన్నా..నేరుగా కార్యాలయంలో కలవొచ్చు. మిర్యాలగూడ వంటి ప్రాంతంలో పని చేయడం ఎంతో సంతోషం.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం..

రానున్న కొన్నేళ్లలో ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంచడమే ధ్యేయంగా ఐఏఎస్‌కు సన్నద్ధమయ్యాను. ప్రస్తుతం సబ్ కలెక్టర్‌గా ధరణి, భూ సమస్యలు వంటివి పరిష్కరిస్తూనే విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాను. బాధ్యతల చేపట్టిన తర్వాత వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు ఓటరు జాబితా సవరణ ముమ్మరంగా చేపడుతున్నాం. అనంతరం గ్రామ పంచాయతీ ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించనున్నాం. ఇటువంటి ఉద్యోగాల్లో పేదలు, దివ్యాంగులను కలిసి వారి సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ప్రణాళికాబద్ధంగా పది గంటలు చాలు..

కరోనా సమయంలో సివిల్స్‌కు సన్నద్ధమైనందున స్వతహాగా ఆన్‌లైన్‌లో చదువుకున్నాను. రోజుకు కేవలం పది గంటల పాటు మాత్రమే చదివాను. సివిల్స్, ఇతర ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే వారు ప్రణాళికబద్ధంగా రోజుకు 10 గంటల పాటు చదివితే చాలు. ప్రస్తుతం ఆన్‌లైన్‌తో పాటు టెలిగ్రామ్ వంటి యాప్‌లలో అనేక మంది నిపుణుల నోట్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని సమగ్రంగా చదివితే ఉద్యోగం సాధించడం కష్టమేమీ కాదు.

డిజిటల్ కార్డుల సర్వే పరిశీలన

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ పురపాలిక పరిధి తొమ్మిదో వార్డులో మొదలైన కుటుంబ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్ గురువారం పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. సర్వేను గడువులోగా పూర్తిచేయాలని, ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రశేఖర్, పుర కమిషనర్ డి.బాలయ్య పాల్గొన్నారు.



నకిరేకల్: అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

భూదాన్ పోచంపల్లి, న్యూస్‌టుడే: ప్రేమించిన యువతితో వివాహం అవుతుందో లేదోనని మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచంపల్లి పట్టణం గాంధీనగర్‌కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన చిలుక శ్రీనివాస్(22) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బంధువైన యువతిని ప్రేమిస్తున్నాడు. వివాహానికి కుటుంబ సభ్యులు ఒప్పుకుంటారో లేదోనని ఆందోళనకు గురయ్యాడు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు బతుకమ్మ ఆడటానికి బయటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి విగతజీవిగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. గురువారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం



మల్లారెడ్డి

చండూరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కస్తాల గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెండు మల్లారెడ్డి(42) తన వ్యవసాయ పొలం సమీపంలోని విద్యుత్తు నియంత్రికకు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడు భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్.వెంకన్న తెలిపారు.

చికెన్ ధరలు	
ఫాంరేటు	112–00
రిటైల్	134–00
డ్రెస్డ్	194–00
స్కిన్‌లెస్	221–00

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతి చెందిన బుచ్చయ్య

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ పట్టణ శివారులోని గ్రీన్ దాబాలో పని చేసే ఓ యువకుడు బుధవారం అర్ధరాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామానికి చెందిన అంకూరి బుచ్చయ్య (30) నాలుగేళ్లుగా పట్టణ శివారులోని గ్రీన్ దాబాలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా గ్రీన్ దాబా రెస్టారెంట్ బంద్ కావడంతో దేవరకొండ పట్టణానికి వెళ్లి తిరిగి రాత్రయ్యాక దాబాకు వచ్చారు. గురువారం తెల్లవారుజామున దాబాలో పని చేసే బుచ్చయ్య మరుగుదొడ్డి సమీపంలో విగత జీవిగా పడి ఉన్నాడు. ఈ విషయాన్ని దాబా నిర్వాహకులు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ నిర్వహించారు. కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ముఖంపై రక్తస్రావం, చేయి నల్లబడటంతో మృతిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించడంతో అవి పని చేయకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. మృతదేహాన్ని గురువారం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

రజితది హత్యే..!



జాల రజిత

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గుర్రంపోడు మండలం ములకపల్లిలో గత నెలలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన జాల రజిత(32)ది హత్యేనని పోలీసులు గురువారం తేల్చారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు గురువారం గుర్రంపోడుకు వచ్చి ములకలపల్లిలో విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో నిందితులుగా భావిస్తున్న జాల రాములును ఇది వరకే రిమాండ్ పంపగా, రెండు రోజుల క్రితం బెయిల్‌పై వచ్చారు. గురువారం డీఎస్పీ రాజశేఖర్ రాజు విచారణ అనంతరం ప్రధాన నిందితుడు రాములు భార్య జాల పార్వతమ్మ, ఆయన అన్న కుమారుడు జాల వెంకటయ్యను అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో వీరు ముగ్గురు హత్యలో పాల్గొన్నట్టు తేలిందని ఆయన వెల్లడించారు. సెప్టెంబరు 29న ములకలపల్లిలో జాల రజిత ఉరి వేసుకుని మృతి చెందిన కేసును తొలుత ఆత్మహత్యగా నమోదు చేయడంతో ఈ కేసులో స్థానిక పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఏఎస్పీ రాములు నాయక్ నేతృత్వంతో ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. త్వరలో పూర్తి వివరాలు పోలీస్ యంత్రాంగం వెల్లడించనుంది.

సాహితీ స్రవంతి



కథానాయకుడు రాజ్‌తరుణ్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న మేఘస్రవంతి (పాత చిత్రం)



చిత్రగీతాన్ని ఆలపిస్తున్న మేఘస్రవంతి

మఠంపల్లి, న్యూస్‌టుడే: సాహిత్యాన్ని శోధించి తెలంగాణలో ప్రఖ్యాతి గాంచిన 100 మంది దాసు కవులను నేటి తరానికి పరిచయం చేసిన ఓ యువ రచయిత్రి అందులో తన పరిశోధన పూర్తిచేసి ఓయూ నుంచి ఇటీవలే డాక్టరేట్ అందుకున్నారు. శతక రచనలతో పాటు మేఘస్రవంతి పేరుతో ఓ కవితా సంపుటినీ వెలువరించి దాన్ని సామాజిక కోణంలో తీర్చిదిద్దారు.. సొంతగా ప్రారంభించిన యూట్యూబ్ ఛానెల్ ద్వారా దేశభక్తి, జానపద గీతాలను స్వయంగా రాసి వాటికి స్వరకల్పన చేయడంతో పాటు స్వీయ గానంతో వీక్షకుల ఆదరణ పొందుతున్నారు. చిత్ర రంగంలోనూ నేపథ్య గాయనిగా వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని తనదైన బాణీలో రాణిస్తున్నారు.

పరిశోధనలో ప్రత్యేకత..

మఠంపల్లికి చెందిన ఉండేటి మేఘస్రవంతి సాహిత్యంపై మక్కువతో ఎంఏ తెలుగు, అనంతర కాలంలో ఎంసీఏ పూర్తిచేసి ప్రస్తుతం జగద్గిరిగుట్ట గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. పీహెచ్‌డీ చేయాలన్న తన చిరకాల స్వప్నం నెరవేర్చుకునేందుకు 2017లో ఓయూలో నిర్వహించిన ప్రతిభా పాటవ పరీక్షకు హాజరై ఐదో స్థానంలో నిలిచారు. పరిశోధనాంశంగా తెలంగాణ దాసు సాహిత్యాన్ని ఎంచుకుని భక్తాగ్రేసరులుగా ప్రఖ్యాతి గాంచిన రామదాసు, వేపూరు హనుమద్దాసు, మన్నెకొండ హనుమద్దాసు, ఈగ బుచ్చిదాసు, దున్న ఇద్దాసు తదితర 100 మంది వాగ్గేయకారుల సాహిత్యాన్ని స్పృశిస్తూ పరిశోధన కొనసాగించారు. 'అనాది అనాథ శతకం' పేరుతో 2021లో అనాదిగా అణచివేతకు గురవుతున్న దీనుల జీవితాలను ఇతివృత్తంగా తీసుకుని పద్య రచన చేశారు.

నేపథ్య గాయనిగా..

మేఘస్రవంతి అంధగాడు, హంతకుడు, రాణిగారి బంగ్లా, పోలీస్ పవర్, అదీ లెక్క, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వంటి పలు చిత్రాల్లో పాటలు పాడారు. ఈటీవీ పాడుతా-తీయగా, దూరదర్శన్ యాదగిరి పాడనా తెలుగు పాట వంటి షోలలో పాల్గొన్నారు. జానపద, దేశభక్తి గీతాలను మధుర గళంతో ఆలపించి ఆల్బమ్‌లు విడుదల చేశారు. భర్త వినయ్‌కుమార్, తల్లిదండ్రులు మరియమ్మ, ప్రభుల ప్రోత్సాహంతో ఈ స్థాయికి రాగలిగానని మేఘస్రవంతి చెప్పారు.

వ్యవసాయ శాఖలో వసూల్ రాజాలు



ఈనాడు, నల్గొండ : 'గతంలో ఏం ఇచ్చారో ఇప్పుడు అనవసరం. నాకు మాత్రం దుకాణానికి రూ.10 వేల చొప్పున ఇవ్వాల్సిందే. లేదంటే మీ దుకాణాలు సక్రమంగా నడపలేరు. అనవసరంగా ఇబ్బందుల పాలు కావొద్దు'.. నల్గొండ జిల్లాలోని ఓ డివిజనల్ వ్యవసాయ అధికారి, ఇటీవల ఆయన్ను కలిసిన ఎరువులు, విత్తనాల దుకాణాల యజమానులకు చేసిన హుకూం ఇది. నల్గొండ జిల్లా వ్యవసాయ శాఖలో ఓ అధికారి వసూల్ రాజాగా మారారు. నెలన్నర క్రితం ఉమ్మడి జిల్లాలోని ఇతర జిల్లా నుంచి బదిలీ అయి వచ్చిన ఆయన.. వచ్చీ రాగానే వసూళ్లకు తెరలేపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల నుంచి టార్గెట్లు పెట్టి మరీ అక్రమాలకు పాల్పడుతున్నారని సంబంధిత శాఖలో ప్రస్తుతం చర్చ సాగుతోంది. ఎరువులు, విత్తనాల దుకాణాలు ఎక్కువగా ఉండే మిర్యాలగూడ డివిజన్‌లో ఈ దందా ఎక్కువగా సాగుతున్నట్లు తెలిసింది. సదరు డివిజన్‌లో సుమారు 100 వరకు దుకాణాలుండగా.. ఒక్కో దుకాణం నుంచి రూ.10 వేలు, మొత్తంగా రూ.10 లక్షలను వసూలు చేయాలని శాఖలోని కొందరు కింది స్థాయి ఉద్యోగుల ద్వారా దుకాణాల యజమానులపై బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. దీంతో నేడో, రేపో వారంతా జిల్లా కలెక్టరును కలిసి తమ గోడును వెల్లబోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు శాఖలోని కొంత మంది మండల స్థాయి అధికారులు సైతం దుకాణాదారులను డబ్బుల కోసం వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిసింది.

> 'నిబంధనలు పాటించని దుకాణాదారులపై ఎలాంటి చర్యలు అయినా తీసుకోనివ్వండి. రైతులకు ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు అందిస్తూ న్యాయంగా వ్యాపారం చేస్తున్న మాపైనా సంబంధిత అధికారులు నిత్యం డబ్బులివ్వాలని వేధిస్తున్నారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి వసూల్ రాజాలపై చర్యలు తీసుకోవాల'ని మిర్యాలగూడలోని ఓ దుకాణాదారుడు 'ఈనాడు'కు వెల్లడించారు.

నకిరేకల్ పుర ఛైర్‌పర్సన్‌గా రజిత



నకిరేకల్: పుర ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన చౌగోని రజితకు ధ్రువపత్రం అందజేస్తున్న నల్గొండ ఆర్డీవో శ్రీదేవి, కమిషనర్ బాలయ్య



నకిరేకల్ పుర ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన రజితను సన్మానిస్తున్న వైస్ ఛైర్‌పర్సన్ ఉమారాణి, కాంగ్రెస్ నాయకులు

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్ పురపాలక సంఘం ఛైర్‌పర్సన్‌గా చౌగోని రజిత (కాంగ్రెస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత భారాస ఛైర్మన్‌పై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఖాళీ అయిన స్థానానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో నల్గొండ ఆర్డీవో, ప్రత్యేక అధికారిణి శ్రీదేవి గురువారం ఎన్నిక నిర్వహించారు. పురపాలికలో మొత్తం 20 మంది వార్డు కౌన్సిలర్లకు గాను 17 మంది హాజరయ్యారు. ఛైర్‌పర్సన్ స్థానానికి 9వ వార్డు కౌన్సిలర్ చౌగోని రజిత పేరును ఒకటో వార్డు కౌన్సిలర్ కందాళ భిక్షంరెడ్డి ప్రతిపాదించగా 16వ వార్డు కౌన్సిలర్ గర్షకోటి సైదులు బలపర్చారని, ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని ఆర్డీవో శ్రీదేవి ప్రకటించారు. రజితతో నూతన ఛైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేయించారు. కమిషనర్ డి. బాలయ్య పాల్గొన్నారు. పుర వైస్ ఛైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి, కౌన్సిలర్లు గాజుల సుకన్య, దైద స్వప్న, యాసారపు లక్ష్మి, పన్నాల పావని, వంటెపాక సోమలక్ష్మి, చౌగోని అఖిల, మట్టిపల్లి కవిత, చౌగోని రాములమ్మ, పోతుల సునీత, స్వాతి, గడ్డం స్వామి, బానోతు వెంకన్న, రాచకొండ సునీల్ ఈ ప్రత్యేక సమావేశానికి హాజరై రజితకు మద్దతిచ్చి అభినందించారు. మేజర్ పంచాయతీగా ఉన్న నకిరేకల్ 2020 డిసెంబరు 16న పురపాలికగా ఆవిర్భవించింది. 2021 మేలో తొలి పాలకవర్గం ఎన్నికైంది. ఐదేళ్ల కాలపరిమితి ముగియక ముందే అవిశ్వాసం ద్వారా ఛైర్మన్ స్థానం ఖాళీ కావడంతో చౌగోని రజిత పురపాలిక రెండో ఛైర్‌పర్సన్‌గా ఎన్నిక అయ్యారు.

★ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో నకిరేకల్‌ను ఆదర్శ పురపాలికగా అభివృద్ధి చేస్తానని నూతన ఛైర్‌పర్సన్ చౌగోని రజిత చెప్పారు.

కోదాడ
•కోదాడ •హుజూర్‌నగర్

పార్టీ అభివృద్ధికి కార్యకర్తల కృషి అవసరం: సీపీఎం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచంలోని అనేక దేశాలు కమ్యూనిజం వైపు చూస్తున్నాయని, దానికి ఉదాహరణే శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో మార్క్సిస్టు నేత దిసనాయకే గెలుపు అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగార్జున పాండు అన్నారు. శ్రీనివాసపురంలో గురువారం జరిగిన గ్రామశాఖ మహాసభలో మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. గ్రామ శాఖ కార్యదర్శిగా నరసింహాచారిని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి, బ్రహ్మం, సైదులు, మండల కార్యదర్శి హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గుంతల్లో వర్షపు నీరు నిలిచి ప్రజలకు ఇబ్బంది కలుగుతుంది. దీంతో వాహనదారులు ఈ రహదారిలో వెళ్లాలంటే భయపడుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి.
– గౌస్, కోదాడ

✔ మా సిబ్బందిని పంపించి క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే గుంతను పూడ్చి వేస్తాం. వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.
– రమాదేవి, పుర కమిషనర్, కోదాడ

చెట్లు విరిగి.. వరి నేలవాలి



రత్నవరం రహదారిపై కూలిన చెట్టు

నడిగూడెం, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం రాత్రి వీచిన గాలి దుమారానికి పలు చోట్ల రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లు నేలకూలాయి. కాగితరామచంద్రాపురం, కృష్ణానగర్, రామాపురం, రత్నవరం రహదారుల వెంట చెట్లు పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల పోలీసులు రహదారికి అడ్డంగా ఉన్న చెట్లు తొలగించారు. రహదారి పక్కనే పడిపోయిన చెట్లను తొలగించలేదు. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

మోతె: మండలంలో బుధవారం రాత్రి వీచిన గాలిదుమారం, వర్షానికి ఈనిన వరి పొలాలు నేలకొరిగాయి. వందల ఎకరాల్లో పంట నేలకు వాలడంతో అపార నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విభలాపురం, మామిళ్లగూడెం, మోతె పరిసర గ్రామాల్లో పంట నేలవాలింది.



మామిళ్లగూడెంలో ఈదురుగాలికి నేలకొరిగిన వరి పొలాలు

గాలులతో వర్షం.. తీరని నష్టం



అనంతగిరిలో నేలకొరిగిన వరిని కట్టలు కడుతున్న రైతు

కోదాడ, అనంతగిరి, న్యూస్‌టుడే: వరి చేతికొచ్చే దశలో భారీ గాలులతో వర్షం రావడంతో పంట పొలాలు నేలకు ఒరిగాయి. దీంతో రైతుకు తీరని నష్టం వాటిల్లింది. పొలం మరో 15 రోజుల్లో చేతికొస్తుందని ఆశ పడ్డ రైతన్నకు నిరాశే ఎదురైంది. ప్రస్తుతం వరి కంకి దశలో ఉన్న రైతులు తలలు పట్టుకుంటున్నారు. గత నెలలో నాటు వేసిన పొలాలకు ఎలాంటి దెబ్బ లేదు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని చాలా మండలాల్లో వరి పంట భారీగా నేలకొరిగింది.

నేలకొరిగిన వరి..

ఎన్నెస్పీ కాల్వ కింద రైతులు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో సాగు చేశారు. ఆ పొలాలకు ఈ వర్షాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ బోర్లు, బావుల కింద జూన్, జులై నెలలో సాగు చేసిన రైతులకు నష్టం వాటిల్లుతోంది. పొలాలు కంకి బయట పెట్టడంతో, వర్షానికి కింద పడి నీళ్లలో నాని వడ్లు తాలు అయ్యే అవకాశం ఉంది. నేలకొరిగిన వరిని నిలబెట్టి కట్టలు కట్టాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ప్రస్తుతం కూలీలతో వరిని కట్టలు కట్టించాలంటే, అదనంగా మరో రూ.10 వేలు ఖర్చు వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఒక్కో ఎకరానికి రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టామని, వర్షాలతో దిగుబడి అమాంతం తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



కోదాడలో వరి పరిస్థితి

మడుల్లో నీరు నిల్వకుండా చేయండి: ఎల్లయ్య, ఏడీఈ, కోదాడ

ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో కంకి దశలో వరి నేలకొరిగింది. దీంతో రైతుకు దిగుబడి తగ్గే అవకాశం ఉంది. మడుల్లో నీరు నిల్వకుండా చేసి.. నేలకొరిగిన వరిని కట్టలు కడితే కొంత మేర నష్టం తగ్గే అవకాశం ఉంది. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే భారీగా నష్టపోతారు.

లునారస్ అంబాసిడర్‌గా మోహనసాయి



హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన అలూగ్ స్పేస్ మిషన్‌లో ఒకటైన లునారస్ రీసెర్చ్ స్టేషన్ వారు భారతదేశానికి అధికార అంబాసిడర్‌గా హుజూర్‌నగర్‌కు చెందిన ఆకుల మోహనసాయిని ఎంపిక చేశారు. ఈ మేరకు గురువారం ఆయనకు మెయిల్ ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. అంతరిక్ష పరిశోధనను ప్రోత్సహించేందుకు, అంతర్జాతీయ అంతరిక్ష సమాజం మధ్య సహకారం పెంపొందించడానికి దోహదపడే విధంగా ఈ నియామకం జరిగింది. ప్రస్తుతం మోహనసాయి మహారాష్ట్రలోని అమిటీ యూనివర్సిటీలో మాస్టర్స్ ఆఫ్ ఆస్ట్రోబయాలజీ, స్పేస్ సైన్స్‌లో చివరి సంవత్సరంలో ఉన్నారు. అంబాసిడర్‌గా మోహనసాయి దేశం తరఫున అలూగ్ మిషన్‌లో పాల్గొనే అవకాశాలను ప్రోత్సహించడం, భవిష్యత్తు అభ్యర్థులను సిఫార్సు చేయడం, దేశం నుంచి అంతరిక్ష రంగంలో ఆసక్తి కలిగిన వారిని అంతర్జాతీయంగా పరిచయం చేయడంలో తోడ్పాటు అందిస్తారు. ఈ సందర్భంగా మోహనసాయి మాట్లాడుతూ ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

విధులు బహిష్కరించి.. నిరసన తెలిపి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు న్యాయవాది ఎంఏ ఖలీల్‌పై మాదన్నపేట పోలీసు దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అంతకు ముందు హుజూర్‌నగర్ రెండో అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి జట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్‌కు వినతిపత్రాలు ఇచ్చి తమ విధుల బహిష్కరణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీరయ్య, న్యాయవాదులు శ్రీనివాసరావు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, యాదగిరి, ప్రదీప్ పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కోదాడ, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదిపై దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి అన్నారు. న్యాయవాదులపై దాడులను నిరసిస్తూ కోదాడ కోర్టులో విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నరసింహారావు, హన్మంతరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ విధానంపై అవగాహన

మోతె, న్యూస్‌టుడే: డ్రమ్ సీడర్ ద్వారా వరిని నేరుగా పొలంలో విత్తుకోవచ్చని, నాటుకు అవసరమైన కూలీల ఖర్చు ఆదా చేయవచ్చని కేవీకే శాస్త్రవేత్త ఆదర్శ రైతులకు సూచించారు. గురువారం రావిపహాడ్, సిరికొండ గ్రామాల్లో డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేసిన వరి క్షేత్రాలను పరిశీలించారు. సాధారణంగా నాటు వేసిన పొలాల కంటే వారం రోజుల ముందుగా డ్రమ్‌సీడర్‌తో వేసిన వరి కోతకు వస్తుందన్నారు. నారుమడి దున్నడం, పెంచడం, నాటువేయడం వంటి పెట్టుబడి ఖర్చుల్లేకుండా నేరుగా వరి సాగు చేపట్టవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సంతోష్, అజయ్, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: రైతులు సమగ్ర ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలని ఎస్‌బీఐ గడ్డిపల్లి మేనేజర్ ఎంకే సుకుమార్ సూచించారు. కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ఆదాయం రెట్టింపు అయ్యే పంటలను ఎంచుకోవాలని పేర్కొన్నారు. పెట్టుబడి తక్కువగా ఉండేలా రసాయన ఎరువుల వాడకం తగ్గిస్తూ సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నారు. భూమి కలుషితం కాకుండా పంట ఉత్పత్తులు నాణ్యమైనవిగా ఉండాలన్నా, భూ ఆరోగ్యం కాపాడుకోవాలన్నా ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమన్నారు. అనంతరం కేవీకే నుంచి జరిగే శిక్షణలు, సేంద్రియ వ్యవసాయం, ఉత్పత్తులు, ఎరువులు తదితర అంశాలను ఇన్‌ఛార్జి డి.నరేష్ వివరించారు. శాస్త్రవేత్తలు ఎ.కిరణ్, సీహెచ్.నరేష్, టి.మాధురి, సుగంధి, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సుకుమార్

వైద్యానికి వచ్చిన యువకుడి అదృశ్యం

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : మానసిక వైద్యం కోసం విజయవాడకు వచ్చిన యువకుడు అదృశ్యమైన ఘటనపై సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్, యాపలసింగారం గ్రామానికి చెందిన చెడపొంగు సుధాకర్ (34) అలియాస్ మరియదాసుకు మానసిక స్థితికి సరిగా లేదు. చికిత్స నిమిత్తం విజయవాడ సూర్యారావుపేటలోని ఓ ప్రైవేటు మానసిక వైద్యశాలలో ఈ నెల ఒకటో తేదీన చేర్చారు. ఆయనతో పాటు భార్య స్వాతి ఉన్నారు. 2వ తేదీ మధ్యాహ్నం డాక్టర్‌కు చూపించేందుకు గది నుంచి వెళ్లారు. ఇంతలో సుధాకర్ ఉన్నఫళంగా బయటకు వెళ్లిపోయారు. అతని కోసం చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సాయిసాధువు

విద్యార్థినులు సాంకేతికతను సద్వినియోగం చేసుకోండి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థినులు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సాయిసాధువు అన్నారు. కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం బీటెక్ విద్యార్థినులకు ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ అంశంపై కార్యశాల నిర్వహించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.గాంధీ, డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.నాగార్జునరావు, సీఎస్‌సీ హెచ్‌వోడీ స్రవంతి పాల్గొన్నారు.

కరుణించవమ్మా.. కనకదుర్గమ్మా..!



నేరేడుచర్లలో ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి ఆలయానికి తీసుకువెళ్లే ముందు పూజలు



హుజూర్‌నగర్‌లో పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ సంపత్‌రెడ్డి



మట్టపల్లి వేద పాఠశాలలో ఏర్పాటు చేసిన కనకదుర్గాదేవి మండపంలో చండీ పారాయణం చేస్తున్న స్మార్త విద్యార్థులు

న్యూస్‌టుడే బృందం: దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు అమ్మవారిని కవచాలంకృత బాల త్రిపుర సుందరిదేవి అలంకరించారు. దేవాలయాల వద్ద గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు. భవానీ మాతలు, మాలధారణ స్వాములు కోలాటాలు, నృత్యాలతో అమ్మవారికి స్వాగతం పలికారు. తొమ్మిది రోజులు అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించడంతో పాటు దర్శనభాగ్యం కల్పిస్తారు. గతంలో ఒకటి రెండు చోట్ల అమ్మవారి విగ్రహాలు ఏర్పాటుచేసి పూజలు చేసేవారు. ఈ ఏడాది రెట్టింపు సంఖ్యలో ఏర్పాటుచేశారు.

నేరేడుచర్ల: పెంచికల్‌దిన్న గ్రామంలో కనకదుర్గమ్మ గుడికి దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన కర్నాటి శ్రీనివాసరావు, సరళ దంపతులు అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని గురువారం అందజేశారు. కర్నాటి గంగాధర్‌రావు, విద్యావతి దంపతులు గర్భగుడిలో అమ్మవారికి ఇత్తడి తొడుగు, కర్నాటి వంశీ, హైందవి దంపతులు వెండి కలశం, దాతలు కట్టా అజయ్, ధనలక్ష్మి దంపతులు పెద్ద ప్రమిదలు అందజేశారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: బూరుగడ్డలో కనకదుర్గమ్మ ఆలయానికి యరగాని చిన నాగరాజు రూ.32 వేల విలువ గల మైక్‌సెట్టును బహూకరించారు.

మఠంపల్లి: మండల కేంద్రంలోని కనకదుర్గ ఆలయానికి మఠంపల్లికి చెందిన మన్నెం కరుణాకర్‌రెడ్డి, ఉమారాణి దంపతులు రూ.55వేలు విలువైన 6 వందల గ్రాముల వెండి గిన్నెను అర్చకుడు సూర్యనారాయణమూర్తికి అందజేశారు.

నడిగూడెం: దుర్గా నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అవసరమైన విగ్రహంతో పాటు పూజా కార్యక్రమాల నిర్వహణకు ముందుకు వచ్చి దాతృత్వం చాటుకున్నాడు నారాయణపురం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి. విగ్రహం ఏర్పాటుతో పాటు, పది రోజుల ఉత్సవాలకు దుర్గామాతకు అవసరమైన చీరలు, పూజా ద్రవ్యాలు, ఉత్సవ కమిటీ సభ్యులైన 42 మందికి తన వితరణతో చీరలు పంపిణీ చేశారు. ఉత్సవాల నిర్వహణకు రూ.50వేలతో దాతృత్వం చాటుకున్న దాతను స్థానికులు అభినందించారు.

మఠంపల్లి: మట్టపల్లి వేద పాఠశాలలో స్మార్త విద్యార్థులు చండీ పారాయణం చేశారు. రఘునాథపాలెం కోదండ రామాలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు చేశారు. లలితా సహస్రనామ పారాయణలు జరిగాయి. వేద పాఠశాల అధ్యాపకుడు ఫణిశర్మ ఘనపాటి, సూర్యానారాయణమూర్తి, సాయికృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



కోదాడ: బాలా త్రిపురసుందరి వేషధారణలో అమ్మవారు



మునగాల: కనకదుర్గ అమ్మవారి ఆలయంలో...



లింగగిరిలో బతుకమ్మలతో వైద్య సిబ్బంది

ప్రకృతిని కొలిచే పండగ బతుకమ్మ

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రకృతిని, పువ్వులను దేవతలుగా కొలుస్తూ అంగరంగ వైభవంగా నిర్వహించుకునే పూల పండుగే బతుకమ్మ అని డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్ అన్నారు. లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు బతుకమ్మ వేడుకలు జరుపుకొన్నారు.



కోదాడ: జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కోలాట ప్రదర్శనలు

నేడు మట్టపల్లికి మంత్రి ఉత్తమ్ రాక

మఠంపల్లి, న్యూస్‌టుడే: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మట్టపల్లికి రానున్నారు. ఉదయం 9 గంటలకు హైదరాబాదు నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు ఇక్కడికి చేరుకుంటారు. 1.30 వరకు ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని 2 గంటలకు బయలుదేరి 6 గంటలకు హైదరాబాదు చేరుకుంటారు.

ఎక్సైజ్ అధికారుల విస్తృత దాడులు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అధికారులు పలు చోట్ల విస్తృత దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. చింతలపాలెం మండలం కొత్తగూడెం తండాకు చెందిన గుగులోతు తులసిరాం తన ఆటోలో 280 కిలోల బెల్లం, 10 కిలోల పటిక తరలిస్తుండగా దొండపాడు వద్ద పట్టుకొని వావాన్ని బెల్లం, పట్టికను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. చింతలపాలెం మండలం ఎర్రకుంట తండాకు చెందిన ధరావత్ చంటి ద్విచక్ర వాహనంపై 80 కిలోల బెల్లం, 10 కిలోల పటికను అక్రమంగా తరలిస్తుండగా వాటిని సీజ్ చేసి నిందితునిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం

అనంతగిరి, న్యూస్‌టుడే: లారీని వెనక నుంచి డీసీఎం ఢీకొట్టిన ఘటన మండలంలోని శాంతినగర్‌లో ఖమ్మం జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనక నుంచి కోదాడ వైపునకు వస్తున్న డీసీఎం ఢీ కొట్టింది. ఈ ఘటనలో డీసీఎం డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

అవగాహన కల్పించి.. సర్వేను పరిశీలించి

అనంతగిరి, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలను సజావుగా అందించడంతో పాటు, ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యుల వివరాలు మార్పులు, చేర్పులు చేసేందుకు డిజిటల్ ఫ్యామిలీ సర్వేను నిర్వహిస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ లత అన్నారు. మండలంలోని తహసీల్ కార్యాలయంలో గురువారం డిజిటల్ సర్వేపై అధికారులకు అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో మండలంలోని వసంతపురం గ్రామం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడంతో గ్రామంలో సర్వేను ప్రారంభించి, అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. మొదటి రోజు 102 కుటుంబాలను సర్వే చేశామని తహసీల్దార్ హిమబిందు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుష్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోదాడ: ప్రతి ఇంటికెళ్లి పకడ్బందీగా సర్వేను నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లత అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 30వ వార్డు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికవ్వడంతో, ఆ వార్డులో సర్వేను పరిశీలించారు. మొదటి రోజు 60 ఇళ్లు సర్వే చేశామని పుర కమిషనర్ రమాదేవి తెలిపారు.



అనంతగిరిలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లత

హుజూర్‌నగర్: పురపాలిక పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా 4వ వార్డులో చేపట్టిన డిజిటల్ సర్వేను ఆర్డీవో శ్రీనివాసులు ప్రారంభించారు.

పాలకవీడు గ్రామీణం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఒకే రాష్ట్రం, ఒకే కార్డు అనే నినాదంతో కుటుంబ గుర్తింపు, కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను చేపట్టినట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. రావిపహాడ్‌లో డిజిటల్ కార్డు సర్వే పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలో రావిపహాడ్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: స్వామినాథన్ సిఫార్సులు వెంటనే అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జిల్లా కన్వీనర్ దొడ్డా వెంకటయ్య అన్నారు. రంగా థియేటర్ చౌరస్తాలో ఎస్‌కేఎం ఆధ్వర్యంలో లఖింపూర్ ఖేరి రైతు అమరులకు నివాళి అర్పించి గురువారం ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటి వరకు అమలు చేయలేదన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యాలు, అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి, తదితరులున్నారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: లఖింపూర్ ఖేరి ఘటన బాధితులకు పరిహారం, ప్రతి కుటుంబానికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. దిల్లీలో మరణించిన రైతులకు, లఖింపూర్ అమర వీరులకు కొవ్వొత్తులు వెలిగించి పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో నివాళి అర్పించారు.

సంక్షిప్త సమాచారం

చింతలపాలెం ఎస్సైగా అంతిరెడ్డి... చింతలపాలెం, న్యూస్‌టుడే: చింతలపాలెం ఎస్సైగా అంతిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పని చేసిన సైదిరెడ్డి నల్గొండ వీఆర్‌కు, అక్కడి నుంచి అంతిరెడ్డి చింతలపాలేనికి బదిలీ అయ్యారు.

పీఆర్సీ వర్తింపచేయాలి.. గరిడేపల్లి: గ్రామపంచాయతీ సిబ్బందికి రెండో పీఆర్‌సీ వర్తింపచేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు షేక్.యాకూబ్ కోరారు. పొనుగోడులో గ్రామ పంచాయతీ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వేతనాలు పెంచుతామని, రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చినా ఇపుడు ఊసెత్తడం లేదని ఆరోపించారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నియామకం.. మేళ్లచెరువు: రేవూరు గ్రామంలో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయ ధర్మకర్తల మండలిని నియమిస్తూ హైదరాబాద్ దేవాదాయశాఖ ఉప కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మకర్తలుగా గాయం రాజశేఖర్‌రెడ్డి, జంగాల ఉషయ్య, పోటు లక్ష్మీనరసయ్య, నార్ల హనుమంతరావు, ధారవత్ కోటేశ్వరి, వరప్రసాద్ నియామకమయ్యారు. వీరితో 5న ప్రమాణస్వీకారం చేయించనున్నట్లు ఈవో గుజ్జుల కొండారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

గొర్రెపోతు చోరీ.. మునగాల: ఆకుపాములలో గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెపోతును చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం. . గ్రామానికి చెందిన మట్టయ్య గత నెల 14న జీవాలను సీసీ రహదారి పైకి తోలగా అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెపోతును ఎత్తుకెళ్లారు. వెతికినా ఫలితం లేకపోవడంతో బాధితుడు గురువారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నివాళి.. మునగాల: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి ఇటీవల మరణించగా హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో క్రాంగెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు సైదులు, కలుకోవ గ్రామశాఖ సీనియర్ నాయకుడు లక్ష్మీ నారాయణ, యూత్ నాయకుడు సతీష్ నివాళి అర్పించారు.

సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:
విష్ణురామ్: దేవర, సత్యం సుందరం, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** దేవర, **రంగా:** సత్యం సుందరం **వెంకటేశ్వర:** మత్తువదలరా-2

16న నిరసన.. కోదాడ పట్టణం: రైతులను మోసం చేయాలని చూస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 16న అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట నల్లబ్యాడ్జీలు, నల్లజెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించాలని రైతు సంఘ నాయకుడు వెంకటేశ్వరరావు అన్నారు.

జమిలి ఎన్నికలకు కుట్ర.. పాలకవీడు గ్రామీణం: సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తిని కాలరాస్తూ జమిలి ఎన్నికల నిర్వహణకు భాజపా కుట్రలు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు ఆరోపించారు. జమిలి ఎన్నికల నిర్వహణను అడ్డుకోవటానికి ప్రతిపక్ష పార్టీలు ఏకతాటి పైకి రావాలని విజ్ఞప్తి చేశారు.

అందజేత.. మఠంపల్లి: గుండ్లపల్లి గ్రామస్థుల తాగు నీటి అవసరాల కోసం మఠంపల్లి సాగర్ సిమెంట్స్ యాజమాన్యం రూ.2లక్షలు విలువైన శుద్ధ జలాల యంత్రాన్ని అందజేశారు. పరిశ్రమ ప్రతినిధి వెంకటరెడ్డి గురువారం ప్రారంభించారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయులు, అధ్యాపకులు వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయి రెడ్డి కోరారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడారు. 2019 సంవత్సరానికి చెందిన ఓటర్ల లిస్టు రద్దు అయ్యిందని, దీంతో అర్హులైన ప్రతి ఒక్కరు నవంబరు 6 వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో పని చేసే వారికి కూడా కొన్ని నియమాలతో ఓటు హక్కు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రొఫెసర్ దండా మురళీధర్‌రెడ్డి, నామాల వీరయ్య, శ్రీనివాస్ రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని తాళ్లగడ్డలో మురుగు కాల్వల్లో పూడిక తీయటం లేదు. మురుగు నిలిచి దుర్వాసనతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. – భార్గవ్, తాళ్లగడ్డ

✔ సిబ్బందితో వెంటనే తీయిస్తాం. – సురేష్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని సైనిక్‌పురి కాలనీలో మట్టిరోడ్లతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పడటంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. – రాములు, సైనిక్‌పురి కాలనీ

✔ నిధుల లభ్యతను బట్టి సీసీగా మారుస్తాం. – శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి తప్పులు జరిగినా చర్యలు తప్పవని, నిబంధనలు పాటించాలని కలెక్టర్ తేజస్ నంద లాల్ పేర్కొన్నారు. హైదరాబాద్ సచివాలయం నుంచి ధాన్యం కొనుగోలు, డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనపై గురువారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కలెక్టర్లతో దూర దృశ్య శ్రవణ సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ స్థానిక అధికారులతో మాట్లాడుతూ సన్నరకం, దొడ్డు రకం ధాన్యానికి వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో 206 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. మండలాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి, కొనుగోలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. అదనపు కలెక్టర్ బీఎస్.లత, డీఆర్డీవో అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, డీటీవో సురేశ్‌రెడ్డి, డీసీఎస్‌వో రాజేశ్వర్, ఏసీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయానికి సాగుతున్నారు..!



అర్వపల్లిలో తోటలో విరబూసిన ముద్దబంతి పూలు



సీతజడ తోట (పట్టుకుచ్చు పూలు)

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: బంతి పూల సాగుపై యువ రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. అప్పట్లో పల్లెల్లో ఎక్కడపడితే అక్కడ దొరికే తంగేడు, గునుగు, వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చేవారు. కాల్వల ద్వారా సాగు జలాలు వస్తుండటంతో విస్తీర్ణం పెరిగి ప్రస్తుతం కంచెలు కరవయ్యాయి. ఎక్కడా దొరక్క పోవటంతో పూలు సాగుచేస్తున్న వారికి గిరాకీ పెరిగింది. రెండు నెలల ముందు మండలంలోని అర్వపల్లి, కోడూరు, తిమ్మాపురం తదితర గ్రామాల్లో బంతి పూలసాగు చేస్తూ మంచి లాభాలను గడిస్తున్నారు ఈ రైతులు.

■ మార్కెట్లో బంతికి మంచి డిమాండ్ ఉండటంతో ఈ పూల సాగునే ఎక్కువ మంది రైతులు ఎంచుకుంటున్నారు. బతుకమ్మ సీజన్లో రూ.100 నుంచి రూ.150ల వరకు పూలను బట్టి ధర పలుకుతోంది. ఒక్కసారి నాటిన బంతి మొక్క నుంచి మూడుసార్లు పూలు తీయవచ్చని చెబుతున్నారు. ఎకరం సాగుతో రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు లాభం ఆర్జించవచ్చని పేర్కొంటున్నారు. ఈ గ్రామాల్లో ముద్దబంతి, జాల్ బంతిని ఎక్కువగా పండిస్తున్నారు. శుభకార్యాలకు తోట దగ్గరికి వచ్చి కొనుక్కుంటున్నారని, వరి, పత్తి సాగు కంటే బంతి సాగే మేలంటున్నారు.

రెండెకరాల్లో సాగు చేస్తున్నా..

– తూటిపల్లి మల్లేష్, అర్వపల్లి



అర్వపల్లిలో కొత్తగూడెం రహదారి వెంట రెండెకరాలు కౌలుకు తీసుకుని బంతి, సీతజడ పూలు సాగు చేస్తున్నా. మూడు నెలల క్రితం మొక్కలు నాటాను. ఇప్పటికీ రెండు సార్లు కోతకు వచ్చింది. వ్యాపారస్తులకు కిలో రూ.60ల నుంచి రూ.80లకు అమ్ముతున్నాం. ఒక్కో మొక్క రవాణా చార్జితో రూ.5ల వరకు వస్తుంది. ఇతర పంటలతో పోల్చితే

బంతి సాగే మేలు..

– గరిగంటి శ్రీకాంత్, తిమ్మాపురం



15 గుంటల భూమిలో ముద్ద బంతి, 5 గుంటల్లో లిల్లీ పూలు సాగు చేస్తున్నా. బతుకమ్మ పండగకు కోతకు వచ్చింది. తిమ్మాపురం సమీపంలో జాతీయ రహదారి వెంటనే మా తోట ఉండటంతో జనం ఇక్కడికే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. కేజీ రూ.100లకు అమ్ముతున్నాం. ఇతర వాటికంటే ఈ సాగే సులభంగా ఉంది.

ప్రకృతి రక్షణపై ఆటా-పాట

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గంజాయి, మాదకద్రవ్యాల నిషేధంపై జాజిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళా



జాజిరెడ్డిగూడెంలో అవగాహన కల్పిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం

బృందంతో ఆటా-పాట కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రకృతిని ఎలా కాపాడుకోవాలో కళా ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో సారథి జిల్లా బాధ్యుడు ఈర్ల సైదులు, కాంగ్రెస్ పార్టీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి గుడిపెల్లి మధుకర్ రెడ్డి, శిగ నసీర్ గౌడ్, విక్రమ్, నాగరాజు, శంకర్, మేడిపల్లి వేణు, ఉదయ్, శ్రీకాంత్, మంజుల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్‌లో 132కేవీ టవర్ నిర్మాణంలో భాగంగా నూతనకల్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని నూతనకల్, చిల్పకుంట్ల, వెంకేపల్లి గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ ప్రణయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య



ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: వేధింపులు భరించలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తాళాపురంలో చోటుచేసుకుంది. స్టేషన్ ఎస్ఐ రత్నావత్ శంకర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్తాళాపురానికి చెందిన షేక్ సైజాన్(24) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి ఖాజా చనిపోగా.. తల్లి సుభానీ హైదరాబాద్‌లో ఉంటున్నారు. పదిహేను రోజులక్రితం ఇంటి వద్ద పోతూ ఉండేవాడు. కొన్నాళ్లుగా ఇదే మండలంలోని కోటినాయక్‌తండాకు చెందిన ఓ యువతిని సైజాన్ ప్రేమించాడు. ఈ వ్యవహారం తెలిసిన యువతి తల్లిదండ్రులు దివ్యాంల పోలీస్‌స్టేషన్‌లో అతడిపై ఫిర్యాదు చేశారు. దీంతోపాటు ఆ యువతి తల్లి.. ఆమె అన్న, బావ కలిసి గత వారం రోజులుగా ఫోన్‌లో బెదిరించడం, వేధింపులకు పాల్పడుతున్నారు. వేధింపులు తాళలేక ఈ నెల 1న అర్ధరాత్రి సమయంలో తన ఇంట్లో ఉరేసుకున్నాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సమాచారం బయటకు తెలియలేదు. బుధవారం ఇంట్లోంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: గర్భిణిని కాన్పు కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా.. 108 వాహనంలోనే ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్‌కు చెందిన గర్భిణి శ్రీలతకు నొప్పులు రావడంతో మోతెకు చెందిన అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. సూర్యాపేటలో పూలసెంటర్‌కు రాగానే నొప్పులు ఎక్కువ కావడంతో శ్రీలత వాహనంలోనే ప్రసవించింది. అనంతరం తల్లి, బిడ్డను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నట్లు అంబులెన్స్ ఈఎంటీ సీహెచ్.వెంకట్రాములు తెలిపారు. వాహన పైలట్ పి.ప్రభాకర్ ఉన్నారు.

'జమిలితో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం'



గోరెంట్ల సీపీఎం గ్రామ మహాసభలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలో గోరెంట్ల గ్రామంలో సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి దీకొండ ఉపేందర్ అధ్యక్షతన గురువారం పార్టీ గ్రామ మహాసభను నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశంలో జమిలి ఎన్నికల ద్వారా రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే విధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి, శంకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కల్లెపల్లి భాస్కర్, సైదులు, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దని.. కళాజాత

నాగారం, న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా ఉజ్వల భవిష్యత్‌ను పొందేందుకు కృషి చేయాలని ఎస్సై ఐలయ్య అన్నారు. నాగారం(బంగ్లా) చౌరస్తాలో గురువారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, అతివేగం, మద్యపానం సేవించి వాహనాలు నడపడం, సైబర్ నేరాల వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసు కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, హోంగార్డులు లింగయ్య, వీరూనాయక్, కళా బృందం యల్లయ్య, గోపయ్య, కృష్ణ, చారి, నాగార్జున పాల్గొన్నారు.

పనుల గుర్తింపు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025-2026 సంవత్సరానికి గాను పనుల గుర్తింపు కార్యక్రమాన్ని అడివెంల గ్రామంలో గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మహాలక్ష్మీ, టీఏలు యాదమ్మ, నాగమణి, క్షేత్ర సహాయకురాలు గంగ పాల్గొన్నారు.

మంత్రగాడనే నెపంతో వ్యక్తిపై దాడి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: మంత్రగాడనే నెపంతో వ్యక్తిపై కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటన తిరుమలగిరి పుర పరిధిలో బుధవారం జరిగింది. ఎస్సై సురేష్ తెలిపిన ప్రకారం.. పుర పరిధిలోని బీసీ కాలనీకి చెందిన పీట్ల పరశురాములు ఇంట్లో పూజలు చేసుకొని బహిర్భూమికి వెళ్లి వస్తున్నాడు. కాలనీకి చెందిన వేముల యాదమ్మ, రాములు, శంకర్, రాజులు కలిసి పరశురాములును స్తంభానికి కట్టేశారు. విషయాన్ని తెలుసుకున్న కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే పరశురాములును స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆయన ఫిర్యాదు మేరకు నలుగురుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖింపూర్ ఖేరిలో 2021న జరిగిన ఘటనకు కారకులైన కేంద్ర సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రాను పదవి నుంచి తొలగించాలని సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మోర్చ జాతీయ కమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ చౌరస్తాలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. దేవిడ్‌కుమార్, గోపి, వెంకటేశ్వర్లు, కోటయ్య, శంకర్, రాంబాబు, కిరణ్‌కుమార్, మల్లారెడ్డి, ప్రవీణ్, వినోద్‌రెడ్డి, పవన్, శ్రీధర్, లింగయ్య పాల్గొన్నారు.

పన్నుల పెంపునకు నిర్ణయం

సూర్యాపేట పురపాలిక: సూర్యాపేటలో విలీనమైన గ్రామాల్లో పన్నులు పెంచుకొనేందుకు కౌన్సిల్ అనుమతి ఇచ్చినందునా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పన్నులు పెంపునకు నిర్ణయం తీసుకున్నట్లు పుర కమిషనర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట పురపాలికలో కుడకుడ, రాయినిగూడెం, దురాజ్‌పల్లి, పిల్లలమర్రి, గాంధీనగర్, కుప్పిరెడ్డిగూడెం, దాసాయిగూడెం, ఖాసింపేట, కుసుమవారిగూడెం గ్రామాలు విలీనమయ్యాయన్నారు. అభ్యంతరాలుంటే మూడురోజుల్లో కమిషనర్ కార్యాలయంలో తెలపాలని కోరారు.

జిల్లాలో ముగ్గురు ఎస్సైల బదిలీ

తుంగతుర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో ముగ్గురు ఎస్సైలను బదిలీ చేస్తూ రెండో మల్టీజోన్ ఐజీపీ వి.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తుంగతుర్తి ఎస్సై ఏడుకొండలు, పెన్‌పహాడ్ ఎస్సై పి.రవీందర్, ఆత్మకూరు(ఎస్) ఎస్సై వై.సైదులులను వారి స్థానాల నుంచి బదిలీ చేసి జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా విషయంలో వీరిని బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరి స్థానాల్లో ఇప్పటివరకు ఎవరినీ కేటాయించలేదు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో).

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3089	1872
జైశ్రీరాం	3375	1550
ఐఆర్-64	2119	1892
హెచ్ఎంటీ	2129	2043
కందులు	9214	9158
పెసర	7789	2009
వేరుసెనగ	7259	3809
బొబ్బర్లు	4059	4059

న్యాయవాదుల విధుల బహిష్కరణ



తుంగతుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా కోర్టులలో న్యాయవాదులు గురువారం కోర్టు విధులు బహిష్కరించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్న మహ్మద్ అబ్దుల్ ఖలీంపై మాదన్నపేట పోలీసులు దాడికి పాల్పడ్డారు. అందుకు నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా కోర్టు విధులను బహిష్కరించాలని తెలంగాణరాష్ట్ర న్యాయవాద సంఘాల సమాఖ్య పిలుపునిచ్చింది. ఈ మేరకు సూర్యాపేట జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయని, వారు స్వేచ్ఛగా విధులు నిర్వర్తించే పరిస్థితి లేదన్నారు. కార్యదర్శి డి.మల్లయ్య, సీనియర్ న్యాయవాదులు టి.బిక్షమయ్య గౌడ్, టి.శ్రీనివాసరావు, వి.సత్యనారాయణ పిళ్లే, అదనపు పి.పి కాకి రాంరెడ్డి, పి.వాణి, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: తుంగతుర్తిలో న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ మాట్లాడారు. న్యాయవాదులు జిల్లా కుమారస్వామి, పర్వీన్, ప్రతాప్, జిలకర చంద్రమౌళి, రాజారాం, సతీష్ పాల్గొన్నారు.

సమగ్రం సర్వే



సూర్యాపేట 37వార్డులో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో వేణుమాధవ్ రావు, తదితరులు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎంపిక పైలెట్ గ్రామ, పుర వార్డులలో అధికారులు ముమ్మరంగా సర్వే చేపడుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడే డిజిటల్ హెల్త్ కార్డులలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఎంపిక చేసిన ప్రాంతాల్లో గురువారం తొలిరోజు 729 కుటుంబాలను అధికారులు సర్వే చేశారు. కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి నివేదికలను అందించేలా కార్యాచరణ రూపొందించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పూనుకుంది. కొత్త సభ్యుల పేర్ల నమోదు చేయడం, పేరులో మార్పులు చేర్పులు వంటివి, కొత్త కుటుంబ కార్డులు నమోదు ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేట్టారు. కుటుంబ సభ్యులు ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డు వివరాలు సర్వే బృందాలు సేకరిస్తున్నారు. గ్రామానికి అయిదు బృందాలు ఎంపిక చేసిన ఇళ్లకు వెళ్లి సర్వే చేపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 716 కుటుంబాలను సర్వే చేపట్టాల్సి ఉండగా తొలి రోజు 442 కుటుంబాల వివరాలు సేకరించారు. అర్బన్ ప్రాంతంలో 1910 ఇళ్లను సర్వే చేపట్టాల్సి ఉండగా 287 ఇళ్లను పూర్తి చేశారు. జిల్లా మొత్తం 2626 కుటుంబాలను సర్వే చేపట్టాల్సి ఉండగా 729 ఇళ్ల వివరాలు సేకరించారు.

తొలి రోజు వివరాలు

నియోజకవర్గం	మండలం	గ్రామం	పూర్తి చేయాల్సినవి	పూర్తయినవి
సూర్యాపేట	పెన్‌పహాడ్	నాగులపహాడ్	183	124
తుంగతుర్తి	మద్దిరాల	రామచంద్రాపురం	158	83
అర్బన్ ప్రాంతం	మున్సిపాలిటీ	వార్డు		
సూర్యాపేట	సూర్యాపేట	37	719	165
తుంగతుర్తి	తుంగతుర్తి	9	315	14

బతుకమ్మ సంబరాలు

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: పట్టణంలోని స్థానిక జయ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులలో తోటి మిత్రులతో కలిసి పాటలు పాడుతూ నృత్యం చేశారు. వివిధ రకాల పూలతో కళాత్మకంగా బతుకమ్మలను తీర్చిదిద్దారు. ప్రదర్శనలు, ఆట పాటలతో ఆనందాన్ని పంచుకున్నారు. పండగ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసేందుకు, ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సూర్యాపేట: బతుకమ్మలతో జయ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు

నూతన కమిటీ ఎన్నిక

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్ శ్రీపార్వతి సమేత శంబులింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా చురకంటి చంద్రారెడ్డి ఎన్నికైనట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ఆవరణలో గురువారం కమిటీ ఎన్నిక నిర్వహించి మాట్లాడారు. వైస్ ఛైర్మన్‌గా బత్తిని లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా బొడ్డుపల్లి అంజయ్య, కోశాధికారిగా ఉప్పల రాజలింగం, జక్కుల ఉప్పలయ్యలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తీగల గిరిదర్‌రెడ్డి, దేవిరెడ్డి నర్సిరెడ్డి, కాప రవికుమార్, బూరెడ్డి సంజీవరెడ్డి, బండపల్లి సాగర్, యాస శ్రీనివాస్‌రెడ్డి, యాస ముత్తారెడ్డి, అనంతుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఎన్నికైన సభ్యులను ఘనంగా సన్మానించారు.

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట ఆరె కటిక సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా జమల్‌పురి పండరినాథ్, ప్రధాన కార్యదర్శిగా జమల్‌పురి రవీందర్, గౌరవ అధ్యక్షులుగా కాస్లేకర్ శంకర్ లాల్, జమల్‌పురి సజన్‌లాల్, ఉపాధ్యక్షుడిగా విఠల్, సభ్యులుగా తదితరులను ఎన్నుకున్నారు.

నడివీధిలో నియంత్రిక.. పక్కకి జరపండిక..!



మండలంలోని తాళ్లసింగారం గ్రామ పంచాయతీ చౌరస్తాలో ఉన్న విద్యుత్తు నియంత్రికతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 20 ఏళ్ల కిందట గ్రామంలో మంచినీటి సమస్య తీర్చడానికి నాటి సర్పంచి జూలూరి క్రిష్ణమూర్తి.. గ్రామానికి చెందిన విశ్రాంత సైనికోద్యోగి దారం రవిందర్ గ్రామపంచాయతీకి అందించిన స్థలంలో మినీ నీటి ట్యాంకు ఏర్పాటుచేసి దానిచుట్టూ కుళాయిలు అమర్చారు. నేడు భగీరథ కింద గ్రామంలో మూడు నీటి ట్యాంకులు మంజూరై నిర్మాణం చేపట్టడంతో ఇవి నిరుపయోగంగా మారాయి. నాలుగు వీధుల మధ్యలో నిరుపయోగంగా ఉన్న మినీ ట్యాంకుపైన నియంత్రికను ఏర్పాటు చేస్తే విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా వీధి వెడల్పుగా మారుతుందని గ్రామస్థులు కోరుతున్నారు. ఎంపీడీవో, విద్యుత్‌శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లి నియంత్రికను ట్యాంకుపైకి మార్చేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి గిలకత్తుల సుధాకర్‌గౌడ్ వివరణ ఇచ్చారు. – న్యూస్‌టుడే, నూతనకల్

దేవీ శరణం.. బాలత్రిపుర సుందరీ దర్శనం

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సూర్యాపేటలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఉదయం సామూహిక హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలను చేపట్టారు. అమ్మవారు బాలత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా పట్టణంలోని ఆయా కాలనీల్లో అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి పూజలను నిర్వహించారు. ఆయా మండపాల వద్ద భక్తులు అమ్మవారి మాలధారణ ధరించి నిష్ఠతో కొలుస్తున్నారు.

ఆత్మకూర్(ఎస్): మండల కేంద్రంతో పాటు కందగట్ల, నెమ్మికల్, తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఘనంగా ఊరేగించి అలంకరించిన మండపాలలో ప్రతిష్ఠించారు. అమ్మవారి మాలధారణ వేసుకున్న భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు.

జాజిరెడ్డిగూడెం: మండలంలోని అన్ని గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

తిరుమలగిరి: మండలంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు.

పెన్‌పహాడ్: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన నూకల వెంకటేశ్వర్లు, పుష్పావతి దంపతులు రూ.లక్ష విలువైన బంగారు పుస్తెల తాడును కనకదుర్గ దేవాలయంలో అర్చకుడు ఇరువంటి సత్యనారాయణ శర్మకు గురువారం అందజేశారు.

తిరుమలగిరి, పెన్‌పహాడ్: మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పలువురు దంపతులు, ఉత్సవకమిటీల నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటాలు, భజనలు, అమ్మవారి నామస్మరణలతో మండపాల వద్ద భక్తిభావం వెల్లివిరిసింది.



సూర్యాపేట కనకదుర్గ ఆలయంలో అమ్మవారి అలంకరణ



మద్దిరాలలో..

మద్దిరాల: చందుపట్లలో జనసేన యువజన సంఘం, మామిండ్లమడవలో భగత్‌సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆమంచి అనంతరామశాస్త్రీ, ప్రసాద్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

నూతనకల్: మండల కేంద్రంలో మాతా ఫ్రెండ్స్‌యూత్, బొడ్రాయి బజార్ యూత్ వేర్వేరుగా దేవీనవరాత్రి ఉత్సవాలను గురువారం ప్రారంభించారు. తాళ్లసింగారంలో దుర్గాభవాని ఫౌండేషన్ సభ్యులు, యడవెల్లి, చిల్పకుంట్ల, వెంకేపల్లి గ్రామాల్లో యూత్ సభ్యులు చేపట్టిన నవరాత్రి ఉత్సవాల్లో గ్రామస్థులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నిర్వాహక కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నూతనకల్‌లో మాజీ సర్పంచి తీగల కరుణశ్రీ గిరిదర్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ దేవిరెడ్డి నర్సిరెడ్డి, దుర్గాభవాని ఫౌండేషన్ సభ్యులు మూల రమేష్, చిత్తలూరి విజయ్ కుమార్ పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎస్) కందగట్లలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి వద్ద మాలధారణ భక్తులు



పెన్‌పహాడ్: లింగాలలో అమ్మవారికి బంగారు పుస్తెలతాడు అందజేస్తున్న దాతలు వెంకటేశ్వర్లు, పుష్పావతి దంపతులు



నూతనకల్: తాళ్లసింగారంలో దుర్గాభవాని ఫౌండేషన్ నిర్వహిస్తున్న దేవీనవరాత్రి ఉత్సవాల్లో భక్తులు

బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం

నూతనకల్, న్యూస్‌టుడే: వెంకేపల్లిలో ఇటీవల మృతిచెందిన పాల్వాయి సుధాకర్, పాల్వాయి సోమయ్య, గురువారం మృతిచెందిన మిర్యాల రాములమ్మ కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు తొన్కునూరి సైదులు నాయకులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కుంట బుచ్చిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు కుంట చంద్రారెడ్డి, పవన్ రెడ్డి, ఎనగందుల సోమయ్య, పరుశురాములు, రాములు తదితరులు పాల్గొన్నారు.